వైభవంగా బుగ్గజాతర ఏర్పాట్లు చేయాలి

❖ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

❖ జాతర ఏర్పాట్లకు రూ.కోటి మంజూరు చేయాలని కలెక్టర్‌కు ఎమ్మెల్యే మల్‌రెడ్డి విజ్ఞప్తి



దశ, ఇబ్రహీంపట్నం: కార్తీక మాసంలో ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆరుట్ల శ్రీ బుగ్గ రామలింగేశ్వరస్వామి జాతరకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. జాతరను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జాతరకు జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా 15 రోజులపాటు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రవాణా, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు.

జాతర పరిసరాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని, అవసరమైన చోట అదనపు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, అవసరమైన అదనపు బలగాలను మోహరించి జాతర ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. జాతర పరిసరాల్లో మద్యం, ఇతర మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు నిఘా పెంచాలని తెలిపారు.

భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా బుగ్గజాతరకు వెళ్లే మార్గాల్లో అదనపు ఆర్టీసీ బస్సులు నడపాలని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్‌కు సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం నేపథ్యంలో రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించి, జాతర పరిసరాలతోపాటు సమీప గ్రామాల్లోనూ పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని ఎంపీడీవో, ఎంపీవోలకు సూచించారు. గత ఏడాది మాదిరిగానే భక్తులకు ఉచిత ప్రసాదం అందించేలా దేవాదాయ శాఖ చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతర ఏర్పాట్ల కోసం ముందస్తుగా రూ.కోటి మంజూరు చేయాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డిని ఫోన్‌లో కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, జాతర ఆధ్యాత్మిక వైభవంతో ప్రశాంతంగా జరిగేందుకు భక్తులు కూడా సహకరించాలని ఎమ్మెల్యే కోరారు.

చెరువులు, కుంటలకు నీటి విడుదలపై ఎమ్మెల్యే కృషి అభినందనీయం

రైతులు, ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు



దశ, నకిరేకల్: నకిరేకల్, కేతేపల్లి మండలాల్లో తాగునీటి ఇబ్బందులను తొలగించేందుకు ఐటీ పాముల రిజర్వాయర్ నుంచి ఎస్ఎల్‌బీసీ కాలువల ద్వారా చెరువులు, కుంటలను నింపేందుకు ఎమ్మెల్యే వేముల వీరేశం కృషి చేయడం అభినందనీయమని నకిరేకల్ ఆత్మ చైర్మన్ కంచర్ల మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ చర్యపై రైతులు, ప్రజల తరఫున ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం కాలువల ద్వారా వస్తున్న నీటితో చెరువులు, కుంటలను నింపేందుకు ప్రజలు వ్యక్తిగత అవసరాలను పక్కనపెట్టి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఐటీ పాముల రిజర్వాయర్ పరిధిలోని చెరువులు, కుంటలను ప్రాధాన్యత క్రమంలో నింపనున్నట్లు తెలిపారు. జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీ చేపడతారని పేర్కొన్నారు. నీటి పంపిణీ సజావుగా జరిగేందుకు రైతులు, ప్రజలందరూ అధికారులకు సహకరించాలని కంచర్ల మహేందర్‌రెడ్డి కోరారు.

బాలుడి మృతి ఘటనపై తారా ఆసుపత్రిలో వైద్యశాఖ తనిఖీలు

రెండు రోజుల్లో విచారణ వివరాలు వెల్లడిస్తాం: డీఎంహెచ్‌ఓ కళ్యాణ్ చక్రవర్తి



దశ, రంగారెడ్డి: బ్రాహ్మణపల్లి చౌరస్తాలోని తారా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో సరైన వైద్యం అందక 14 ఏళ్ల బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. మంగళవారం ఆసుపత్రిని తనిఖీ చేసి, వైద్య సదుపాయాలను పరిశీలించడంతో పాటు బాలుడికి అందించిన చికిత్స వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ.. బాలుడి మృతి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఆసుపత్రికి ప్రస్తుతం తాత్కాలిక అనుమతులు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం ఆసుపత్రి బోర్డుపై పేర్లు నమోదైన వైద్యులే చికిత్సలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రి యాజమాన్యం నుంచి పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, రెండు రోజుల్లో విచారణ వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. విచారణలో నిబంధనల ఉల్లంఘనలు లేదా ఆసుపత్రి యాజమాన్యం నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆసుపత్రిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డీఈఎంఓ మంజుల, మండల వైద్యాధికారి ప్రియాంక, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జీహెచ్‌ఎంసీ పరిధి నుంచి 8 కి.మీ. లోపు ఉద్యోగులకు 24% హెచ్‌ఆర్ఏ ఇవ్వాలి

❖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌కు ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి

❖ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. కే. రామారావు వినతి

దశ, రంగారెడ్డి: జీహెచ్‌ఎంసీ పరిధి నుంచి 8 కిలోమీటర్ల లోపు కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 24 శాతం ఇంటి అద్దె భత్యం (హెచ్‌ఆర్ఏ) మంజూరు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని రంగారెడ్డి జిల్లా ఉద్యోగుల జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌ను కోరారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డాక్టర్ కే. రామారావు విజ్ఞప్తి చేశారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధి నుంచి 8 కిలోమీటర్ల లోపు పనిచేస్తున్న ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్ఏ వర్తింపజేసేందుకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇచ్చినట్లు సంబంధిత ఉత్తర్వుల్లో పేర్కొన్నారని జేఏసీ నాయకులు తెలిపారు. అయితే, ప్రభుత్వం జారీ చేసిన తదుపరి ఆదేశాల ప్రకారం ప్రత్యేక ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా హెచ్‌ఆర్ఏ, నగర పరిహార భత్యం (సీసీఏ), ఇతర భత్యాల పెంపు లేదా సవరణలకు అనుమతి లేదని సంబంధిత శాఖలకు సూచనలు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో ఉద్యోగులకు 24 శాతం హెచ్‌ఆర్ఏ వర్తింపజేసే అంశంపై ఆర్థిక శాఖ అనుమతి పొందేందుకు అవసరమైన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్‌ను కోరారు. ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీనేష్‌కుమార్ నోరి, నూతనకంటి వెంకట్, శాంతిశ్రీ, రేవతి, నర్సిరెడ్డి, రాకేష్, శ్రీనివాస్, సైదమ్మ, అనిత, నాగేశ్వరరావు, మహేష్, బాలేశ్వరి, సూర్యజ్యోత్స్న, రాణి, ప్రమీల, రంగయ్య, గోపాల్‌నాయక్, శ్రీధర్‌రెడ్డి, శేఖర్, వాణి, గౌస్, తేజ, రాములు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు తప్పని నిరీక్షణ!



❖ ఉదయం నుంచి పనిచేయని ప్రింటర్.. అందుబాటులో లేని సబ్ రిజిస్ట్రార్



దశ, మాడ్గుల: మాడ్గుల మండల తహసీల్దార్ మరియు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రింటర్ పనిచేయకపోవడం, మరోవైపు సబ్ రిజిస్ట్రార్ అందుబాటులో లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఉదయం నుంచి కార్యాలయంలో పనులు నిలిచిపోవడంతో ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు సాంకేతిక సమస్యలు, అధికారుల అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పనులు కాక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో విలువైన సమయంతో పాటు ప్రయాణ ఖర్చులు కూడా వృథా అవుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సకాలంలో సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నప్పటికీ, ఇలాంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడటం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రింటర్ సమస్యను పరిష్కరించాలని, రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించి కార్యాలయ సేవలు సజావుగా సాగేలా పర్యవేక్షించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నూతన ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డికి సత్కారం

దశ, అశ్వారావుపేట: అశ్వారావుపేట పోలీస్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై)గా బాధ్యతలు స్వీకరించిన బి. సాయి కిషోర్ రెడ్డిని బీఆర్ఎస్ మహిళా నాయకురాలు, మాజీ సర్పంచ్ సాధు జ్యోత్స్నాభాయ్, బీఆర్ఎస్ నాయకురాలు సంకుల స్వరూప మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైకి శాలువా కప్పి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతూ పోలీసు శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించేలా సేవలందించాలని ఆకాంక్షించారు.

రాజ్యాంగాన్ని చదివాకే దేశానికి ఉపన్యాసాలు ఇవ్వాలి

❖ రాహుల్ గాంధీపై బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య గౌడ్ విమర్శలు

దశ, హైదరాబాద్: రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకుని ప్రదర్శించడం కంటే, దాని నిబంధనలను అర్థం చేసుకుని గౌరవించడం ముఖ్యమని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డా. బూర నర్సయ్య గౌడ్ అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ)ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీని రాహుల్ గాంధీ కోరడంపై ఆయన విమర్శలు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారిపై చర్యలు తీసుకోవడానికి నిర్దిష్టమైన విధానాలు ఉంటాయని, రాజకీయ డిమాండ్లతో వాటిని పక్కనపెట్టలేరని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ తొలగింపునకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి తొలగింపునకు వర్తించే విధానాన్ని అనుసరించాల్సి ఉంటుందని బూర నర్సయ్య గౌడ్ వివరించారు. ఆర్టికల్ 124(4)లో పేర్కొన్న ప్రక్రియ ప్రకారం నిరూపిత దుర్వ్యవహారం లేదా అసమర్థత వంటి కారణాలు ఉండాలని, పార్లమెంటు ఉభయసభల్లో నిర్దేశిత ప్రత్యేక మెజారిటీతో తీర్మానం ఆమోదం పొందిన తర్వాతే రాష్ట్రపతి తొలగింపు ఉత్తర్వులు జారీ చేయగలరని తెలిపారు. సీఈసీపై రాహుల్ గాంధీకి అభ్యంతరాలు ఉంటే నిర్దిష్టమైన ఆరోపణలు, విశ్వసనీయమైన ఆధారాలతో రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరించాలని సూచించారు. తీవ్రమైన ఆరోపణలు చేసేటప్పుడు ఆధారాలు చూపాలని, రాజకీయ నాటకీయతకు ప్రాధాన్యం ఇవ్వకూడదని అన్నారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత పదవి కీలకమైనదని, ఆ బాధ్యతను నిర్వర్తించేందుకు రాజ్యాంగంపై అవగాహన, వాస్తవాల ఆధారంగా చర్చించడం అవసరమని పేర్కొన్నారు. రాజ్యాంగ ప్రతిని ప్రదర్శించడం కంటే దాని విలువలను, నిబంధనలను గౌరవించడం ముఖ్యమన్నారు. "రాజకీయ కామెడీని ఆపండి.. రాజ్యాంగంపై అవగాహన పెంచుకోండి.. దేశ భవిష్యత్తుపై అర్థవంతమైన చర్చకు రండి" అని రాహుల్ గాంధీకి బూర నర్సయ్య గౌడ్ సూచించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేలా వాస్తవాలు, ఆధారాలతో నిర్మాణాత్మక విమర్శలు చేయాలని, రాజ్యాంగ సంస్థలను రాజకీయ ఘర్షణలకు వేదికలుగా మార్చకూడదని ఆయన పేర్కొన్నారు.



అత్యాధునిక శస్త్రచికిత్సతో రోగికి ఉపశమనం

❖ చేతులు, కాళ్లలో తిమ్మిరి

❖ ఉంటే అప్రమత్తంగా ఉండాలి

❖ సకాలంలో వైద్య చికిత్సతో మెరుగైన ఫలితాలు

❖ డా. శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలో విజయవంతమైన శస్త్రచికిత్స

❖ సకాలంలో చికిత్సతో శాశ్వత వైకల్యం ముప్పు తగ్గే అవకాశం



దశ, ఇబ్రహీంపట్నం: చేతులు, కాళ్లలో తిమ్మిరి, చేతి పట్టు తగ్గడం, నడవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు. మెడ భాగంలోని వెన్నుపాముపై ఒత్తిడి కారణంగా రోజువారీ పనులు చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న 36 ఏళ్ల వ్యక్తికి మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు.

హైదరాబాద్‌లోని జిల్లెల్‌గూడకు చెందిన బడుకల రాము రెండు చేతులు, రెండు కాళ్లలో తిమ్మిరితో పాటు చొక్కా గుండీలు పెట్టుకోవడం, ముఖం కడుక్కోవడం, వస్తువులను పట్టుకోవడం, నడవడం వంటి పనుల్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంఆర్ఐ పరీక్షల్లో మెడ వెన్నెముకలో డిస్క్ ఉబ్బడం, స్పైనల్ కెనాల్ సన్నబడటం, వెన్నుపాముపై ఒత్తిడి ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వెన్నుపాము కణజాలంలో మార్పులను సూచించే ఫోకల్ మైలోమలేసియా కూడా ఉన్నట్లు నిర్ధారించారు.

సీ3 నుంచి సీ6 వరకు శస్త్రచికిత్స

సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డా. శ్రీనివాస్ బొట్ల రోగిని పరీక్షించి శస్త్రచికిత్సకు ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా సీ3 నుంచి సీ6 వరకు సర్వైకల్ లామినెక్టమీ నిర్వహించి, వెన్నుపాముపై ఒత్తిడిని తొలగించారు. మెడ వెన్నెముకకు స్థిరత్వం కల్పించేందుకు టైటానియం స్క్రూలు, రాడ్లతో ఫిక్సేషన్ చేయడంతో పాటు బోన్ గ్రాఫ్ట్ ఫ్లేస్‌మెంట్ నిర్వహించారు. డా. అశ్విని అనస్థీషియా సేవలు అందించారు.

శస్త్రచికిత్స అనంతరం మెరుగైన ఆరోగ్యం

శస్త్రచికిత్స అనంతరం రోగిని ఐసీయూలో పర్యవేక్షించి, ఫిజియోథెరపీ అందించారు. అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో వార్డుకు తరలించారు. శస్త్రచికిత్స అనంతరం తిమ్మిరి లక్షణాలు గణనీయంగా తగ్గాయని రోగి తెలిపారు. గాయం ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు వెన్నెముక అమరిక కూడా సక్రమంగా ఉన్నట్లు ఎక్స్‌రే పరీక్షల్లో వెల్లడైంది. వైద్యుల సూచనలతో రోగిని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాస్ బొట్ల మాట్లాడుతూ, చేతులు, కాళ్లలో తిమ్మిరి, చేతి పట్టు తగ్గడం, నడవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు. శస్త్రచికిత్స అనంతరం అధిక బరువులు ఎత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఫిజియోథెరపీతో పాటు నిర్ణీత సమయాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. రోగికి చికిత్స అందించడంలో న్యూరోసర్జరీ, అనస్థీషియా, ఫిజియోథెరపీ బృందాలు సమన్వయంతో పనిచేసినట్లు ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. ఈ కార్యక్రమంలో వాసుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలి

'ఛలో జవహర్‌నగర్' పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, బీజేపీ నాయకులు



దశ, ఓయూ: జవహర్‌నగర్ డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎదులాబాద్ నుంచి చేపట్టిన 'ఛలో జవహర్‌నగర్' మహా పాదయాత్రలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్ పాల్గొన్నారు. ఈటల రాజేందర్‌తో కలిసి వారు పాదయాత్రలో అడుగులు వేశారు.డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న దుర్వాసన, భూగర్భ జలాలు కలుషితం కావడం, వాయు కాలుష్యం కారణంగా పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది కుటుంబాల ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని, ముఖ్యంగా చిన్నారుల భవిష్యత్తుపై ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. పలుమార్లు విజ్ఞప్తులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు డంపింగ్ యార్డును వెంటనే తరలించాలని డిమాండ్ చేశారు.ఈ పాదయాత్రలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రమౌళి, బీజేపీ కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్‌రెడ్డి, హన్మంత్ బిరాదర్, రాజిరెడ్డి, క్రాంతికుమార్, మంజులవాణి తదితర నాయకులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి: మంచిరెడ్డి కిషన్ రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సమావేశం.




దశ, ఇబ్రహీంపట్నం: రానున్న మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఇన్‌చార్జ్, మాజీ మండలి చైర్మన్ స్వామి గౌడ్, భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ క్యామ మల్లేష్ సమావేశంలో పాల్గొన్నారు. పట్టభద్ర ఓటర్ల నమోదు, పార్టీ శ్రేణుల సమన్వయం, ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. నియోజకవర్గంలోని ప్రతి పట్టభద్ర ఓటరును కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని నాయకులకు సూచించారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ప్రజలకు వివరించాలనిమంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచించారు.యువత,పట్టభద్రుల సమస్యలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్‌కు మద్దతు కూడగట్టాలని, పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీల అధ్యక్షులు, కార్యదర్శులు, సమన్వయ కమిటీ సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలన అందరి బాధ్యత



దశ , తాండూర్ ప్రతినిధి: తాండూర్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నెంబర్ 1 పాఠశాలలో సురక్షిత్ బచ్పన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తాండూర్ జూనియర్ సివిల్ జడ్జ్ గిరిజ తిరందాసు ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఫోక్సో చట్టం విద్య హక్కు చట్టం బాల్యవివాహాల నిర్మూలన మరియు బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. విద్యార్థులు భావి భారత పౌరులు ప్రతి చట్టపైన అవగాహన కలిగి ఉండాలి. ఇదే సందర్భంగా న్యాయవాది జిలాని మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు దేశ అభివృద్ధికి ఎంతో కీలకము. దేశం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు చట్టాల పైన అవగాహన పెంచుకొని రాజకీయాలకు కూడా చెరుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉంది.భవిష్యత్తు తరాలు మొత్తం విద్యార్థులదే కాబట్టి నేటి బాలలే రేపటి పౌరులు. చట్టాలను తెలుసుకొని దానికి అనుగుణంగా మెల్లగడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత.ఈ కార్యక్రమంలో తాండూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు కే శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి పాశం రవికుమార్ ప్యానల్ న్యాయవాదులు జిలాని టీ. అరుణ ఏ.పరమేశ్వరి మస్తాన్ దేవ్ రాజ్ మరియు న్యాయవాదులు కోర్టు సిబ్బంది హెడ్మాస్టర్లు గోపాల్, అబ్దుల్ రెహమాన్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలకు సబ్సిడీ



- పెట్రోల్, డీజిల్ ధరల భారం కన్నా బెటర్
- పర్యావరణానికి మేలు చేసే ఎలక్ట్రిక్
- ఈ పథకం ద్వారా సబ్సిడీ ఎలా పొందాలి.
- సబ్సిడీ పొందడానికి మీ ఆధార్ కార్డు నంబర్ తప్పనిసరి
- ఈ కేవైసీ ప్రక్రియ తప్పనిసరి
- పీఎం ఈ డ్రైవ్ పథకం ముగింపు తేదీ ఎప్పుడు?

దశ,తాండూర్ ప్రతినిధి

ఎలక్ట్రిక్ టూవీలర్లకు పీఎం ఈ డ్రైవ్ పథక ప్రోత్సాహకాలను కేంద్ర ప్రభుత్వం 2028 మార్చి 31 వరకు పొడిగించింది. అయితే, కేటాయించిన నిధులు పూర్తిగా ఖర్చయినా, లేదా అర్హత గల వాహనాల లక్ష్యం చేరుకున్నా, ఈ ప్రయోజనం ఆ తేదీకి ముందే ముగియవచ్చు. ఇతర వాహన కేటగిరీలకు వేర్వేరు గడువులు వర్తించవచ్చు. కాబట్టి, వాహనం కొనాలనుకునేవారు ఆలస్యం చేయకుండా, ప్రస్తుత నిధుల లభ్యతను ముందే తెలుసుకోవడం ఉత్తమం.

ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలు

ఇంధన ఆధారపడటం తగ్గుతుంది
ఎలక్ట్రిక్ వాహనాలు వాడటం వల్ల పెట్రోల్/డీజిల్ వినియోగం తగ్గుతుంది.

రన్నింగ్ ఖర్చు తగ్గుదల
వాహన వినియోగం, విద్యుత్ టారిఫ్‌లు మరియు ఛార్జింగ్ సౌకర్యాలను బట్టి రోజువారీ ప్రయాణ ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి.

పర్యావరణ రక్షణ
వాయు కాలుష్యం మరియు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

కొనుగోలుకు ముందు గమనించాల్సిన ముఖ్యమైన విషయాలు (మైత్రి బస్టింగ్)

- అందరికీ ₹25,000 సబ్సిడీ వస్తుందన్న ప్రచారం పూర్తిగా తప్పు. ఇది కేవలం పుకారు మాత్రమే.
- సబ్సిడీ అన్ని కంపెనీలకూ, అన్ని మోడళ్లకూ వర్తించదు. కేవలం పథకంలో నమోదైన మోడళ్లకే ఇది వర్తిస్తుంది.
- ప్రోత్సాహక మొత్తం వాహనం యొక్క బ్యాటరీ సామర్థ్యం (కే డబ్ల్యూ హెచ్) మరియు ధర పరిమితులపై ఆధారపడి మారుతుంది (కొన్నింటికి ₹5,000 వరకు లేదా అంతకంటే ఎక్కువ వర్తించవచ్చు).
- వాహన మోడల్, ధర మరియు ప్రస్తుత నిబంధనలను డీలర్ వద్ద ధృవీకరించుకున్న తర్వాతే కొనుగోలు నిర్ణయం తీసుకోండి.
- పథకం ఎలక్ట్రిక్ వాహనాలను మరింత చేరువ చేయడానికి రూపొందించబడింది. సరైన ప్లానింగ్ మరియు అర్హత తెలుసుకుని కొనుగోలు చేయడం ద్వారా, మీరు ఇంధన ఖర్చులను ఆదా చేసుకోవడమే కాకుండా, కాలుష్య నియంత్రణకు కూడా తోడ్పడవచ్చు.

ఎంత సబ్సిడీ వస్తుంది?

సబ్సిడీ మొత్తం వాహనం యొక్క బ్యాటరీ సామర్థ్యం మరియు ధరను బట్టి మారుతుంది. కొన్ని మోడళ్లపై ₹5,000 వరకు లేదా అంతకంటే ఎక్కువ ప్రోత్సాహకం లభించవచ్చు. ఇది ఫిక్స్డ్ మొత్తం కాదు.

అందరికీ ₹25,000 సబ్సిడీ వస్తుందన్న వార్త నిజమేనా?

కాదు. అది తప్పుడు ప్రచారం. సబ్సిడీ మొత్తం వాహనం స్పెసిఫికేషన్లు మరియు ప్రభుత్వ నిబంధనలపై ఆధారపడి ఉంటుంది.

పీఎం ఈ డ్రైవ్ పథకం చివరి తేదీ

ఈ పథకం ప్రోత్సాహకాలు 2028 మార్చి 31 వరకు అందుబాటులో ఉంటాయి. అయితే, కేటాయించిన నిధులు ముందుగానే ఖర్చయితే పథకం ముందుగానే ముగియవచ్చు.

సబ్సిడీ పొందడానికి ఆధార్ కార్డు తప్పనిసరి

ఈ-వోచర్ జనరేట్ చేయడానికి మరియు డౌన్‌లోడ్ లింక్ పొందడానికి మీ ఆధార్ కార్డు మీ మొబైల్ నంబర్‌కు లింక్ అయి ఉండటం తప్పనిసరి.

సాగు భూమి సంరక్షణపై రైతులకు అవగాహన

❖ *రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి.. పంటల మార్పిడితో భూసారం కాపాడాలి*



దశ, అబ్దుల్లాపూర్‌మెట్: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, ఎగుమతులు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (FPOలు), పీఏసీఎస్‌లు, స్వయం సహాయక సంఘాల (SHGలు) ఆధ్వర్యంలో కస్టమ్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వివరించారు. అనంతరం రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి పల్లవి ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి. సుధీర్ నేతృత్వంలో *'ఖేత్ బచావో అభియాన్' (సాగు భూమి సంరక్షణ)* కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. పాడి పశువులున్న రైతులు మేలైన పశుగ్రాస రకాలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి పచ్చిరొట్ట ఎరువులను ఉపయోగించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యాసంగి సీజన్‌లో కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాలు, నూనెగింజల వంటి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను సకాలంలో పొందేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కనీసం మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేయాలని సూచించారు. ఒకే పంటను వరుసగా సాగు చేయకుండా పంటల మార్పిడి విధానాన్ని పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డి. సుధీర్, దిలీప్, ఐసీఏఆర్-నారం శాస్త్రవేత్త డాక్టర్ అనూష, సర్పంచులు విజయ, శ్రీశైలం, బాలకిషన్, వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, పీఏసీఎస్ అధికారులు మల్లికార్జున్, రాకేష్, రైతులు ఎస్. బాల్‌రెడ్డి, లింగమయ్య, జంగారెడ్డి, ధర్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులు ఆటపాటల్లోనూ రాణించాలి

దశ, సూర్యాపేట ప్రతినిధి : విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఏఎంఓ హరి కృష్ణ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలభవన్ లో ఆయన ఆధ్వర్యంలో ఆర్ట్, డాన్స్, మ్యూజిక్, క్రాఫ్ట్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 31 టీమ్‌ల నుంచి ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రావణ్ కుమార్, నాగరాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.



టీఆర్ఎస్ (డి) పార్టీలో కల్లేపల్లి లక్ష్మీనారాయణ చేరిక

చేరికల కమిటీ చైర్మన్‌గా, మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా నియామకం


దశ ఓయూ : టీఆర్ఎస్ (డి) పార్టీలో కల్లేపల్లి లక్ష్మీనారాయణ చేరారు. హైదరాబాద్‌తో పాటు మరో నాలుగైదు జిల్లాల్లో ప్రభావం చూపగల సామర్థ్యం కలిగిన లక్ష్మీనారాయణ పార్టీ చేరికతో సంస్థాగతంగా మరింత బలోపేతం అవుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ పేర్కొన్నారు.ఈ సందర్భంగా కల్లేపల్లి లక్ష్మీనారాయణను పార్టీ చేరికల కమిటీ చైర్మన్‌గా, మేనిఫెస్టో కమిటీ కన్వీనర్‌గా నియమిస్తున్నట్లు నరాల సత్యనారాయణ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. గతంలో లక్ష్మీనారాయణ మాదిగ కులవృత్తి హక్కుల పరిరక్షణ సమితి ఎం.కే హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగారు.

ఉస్మానియా వర్సిటీలో రెండో రోజు నాన్ టీచింగ్ ఉద్యోగుల నిరసన

❖ *ఉద్యోగుల సమస్యలకు ప్రొఫెసర్ల సంఘీభావం*

దశ, ఓయూ: ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన లంచ్ అవర్ డెమాన్స్ట్రేషన్ రెండో రోజు మంగళవారం విజయవంతంగా కొనసాగింది. ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో నిర్వహించిన నిరసనలో ఆరు సంఘాలకు చెందిన నాన్ టీచింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్లు వెంకటదాస్, నతానియల్ సంఘీభావం తెలిపారు. నాన్ టీచింగ్ ఉద్యోగులు లేవనెత్తుతున్న సమస్యలు న్యాయమైనవని, వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత యూనివర్సిటీ యాజమాన్యంపై ఉందని వారు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోతే వారికి అండగా నిలిచి ఉద్యమంలో పాల్గొంటామని హామీ ఇచ్చారు. సీపీఎస్ సమస్యతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులకు ఉమ్మడిగా ఉన్న పలు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం ఇద్దరు ప్రొఫెసర్ల సంఘీభావం తెలిపేందుకు వచ్చామని, త్వరలో 50 మంది, ఆ తర్వాత వందలాది మంది అధ్యాపకులు ఉద్యోగుల ఉద్యమానికి మద్దతుగా నిలుస్తారని తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే



వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నాన్ టీచింగ్ జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. యాజమాన్యం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ జేఏసీ చైర్మన్ కుమార్, ఖదీర్ ఖాన్, నాగరాజు, పవన్, వెంకటేష్, అక్బర్ బేగ్, అప్పర్, నారాయణ, విట్టల్, యారాల రాజేష్, డాక్టర్ ఏ. అంజయ్యతో పాటు ఆరు సంఘాల నాయకులు, వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.